క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: చెట్ల కొమ్మల తొలగింపు పనులు, సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఇబ్రహీంపట్నం టౌన్ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ సీతారాం తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు భాగ్యనగర్ కాలనీ, పాత బస్టాండ్, జంగాల బస్తీ, యాదవ బస్తీ, ప్రభుత్వ దవఖానా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మాదిగ జేఏసీ ఇన్‌చార్జిగా చింతయ్య



నియామకపత్రం అందజేస్తున్న పిడమర్తి రవి

ఇబ్రహీంపట్నం రూరల్: మాదిగ జేఏసీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా చింతకుంట చింతయ్యను నియమించారు. ఈ మేరకు సోమవారం మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతయ్య మాట్లాడుతూ మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి నిరంతరం శ్రమించాలని కోరారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పిడమర్తి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

మృతులకు నేతల నివాళి

కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్‌నాయక్

కడ్తాల్: టోల్‌గేట్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుప్పరి రాజు, సిద్ధిగారి మహేశ్ మృతదేహాలకు సోమవారం పలువురు నేతలు నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గోలి శ్రీనివాస్‌రెడ్డి రూ.15వేలు, దశరథనాయక్ రూ.10వేలు ఆర్థికసాయం, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ రూ.6వేలు ఆర్థికసాయం అందజేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుమన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఈ మేరకు ఆమె కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆమెకు రూ.23వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వెంకటయ్య, జంగయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల ఏర్పాటుతో ప్రమాదాల నివారణ



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో లిమ్స్ ఆస్పత్రి అందించిన బారికేడ్లను సోమవారం గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రారంభంలోని దేవాలయం, ప్రభుత్వ పాఠశాల వద్ద ఆ ఆస్పత్రి అందించిన బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఇవి ఉపయోగపడనున్నాయన్నారు. అనంతరం లిమ్స్ ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, విజయ్, అంజిరెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకే మొగ్గు!

- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చేందుకు ఆసక్తి చూపని రైతులు
- నాణ్యత పేరిట ఇబ్బందులు
- ప్రభుత్వానికి విక్రయిస్తే డబ్బులు ఆలస్యమవుతాయని ఆందోళన
- యాచారం పరిధిలో ఇప్పటి వరకు 700 క్వింటాళ్ల ధాన్యమే సేకరణ



తేమ శాతం నింబంధనల ప్రకారం ఉండటానికి రైతులు ఎండబెడుతున్న వరి ధాన్యం

యాచారం: ధాన్యం కొనుగోళ్లలో నింబంధనల పేరుతో నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే సరైన మద్దతు ధరకు అమ్ముకుందామనే రైతుకు భరోసా లేకుండా పోయింది. కొనుగోళ్ల సమయంలో లేనిపోని నింబంధనలతో పెట్టే ఇబ్బందుల వల్ల తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వాహకులు పెట్టే అవస్థలతో కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండా, తక్కువ ధరకైనా సరే దళారులకే, విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. యాచారం మండలంలోని యాచారం, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. గతంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన వెంటనే క్వింటాళ్ల కొద్ది ధాన్యం వచ్చేది. కొనుగోలు సమయంలో సరిపడా బస్తాలు ఇవ్వడం లేదని, సకాలంలో కొనుగోలు చేయడం లేదని, సౌకర్యాలు లేవని రైతులు ఆందోళనలు నిర్వహించే వారు. కానీ ప్రస్తుతం ఇవేవీ కనిపించడం లేదు. గ్రామాల్లో పండించిన ధాన్యాన్ని అసలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావలంటేనే రైతులు ఆసక్తి చూపడం లేదు.

60 శాతం కోతలు పూర్తి

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ఈ వానాకాలం కింద 4,120 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఎకరా పొలంలో వరి పంటను సాగు చేయడం కోసం రైతులు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడికి ఖర్చు చేశారు. 4,120 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు రైతులు దాదాపు రూ. 8 కోట్లకు పైగానే పెట్టుబడులు పెట్టారు. చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కిషన్‌పల్లి, మాల్, తక్కళ్లపల్లి, నందివనపర్తి, గునుగల్, యాచారం, తాడిపర్తి, కుర్మిద్ద, చింతుల్ల, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా వరి పంటను సాగు చేశారు. ఆయా గ్రామాల్లోని రైతులు ఇప్పటికే 60 శాతంకు పైగానే వరి పంటను కోశారు. వానాకాలంలో ఆలస్యంగా పంటను సాగు చేసిన రైతులు ఈ వారం, పక్షం రోజుల వ్యవధిలో మిగితా 40 శాతం పంటను పూర్తిగా కోసే అవకాశం ఉంటుంది. కొన్ని గ్రామాల్లో కూలీల కొరత, యంత్రాల దొరక్కపోవడంతో కోతలు ఆలస్యమవుతున్నాయి.

నేటికి 700 క్వింటాళ్ల ధాన్యమే సేకరణ

మండలంలోని నాలుగు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కూడ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావడం లేదు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే 2,200 ఎకరాలకు పైగా ఎకరాల్లో వరి పంటను కోశారు. ఎకరా పొలంలో పండే పంటకు ధాన్యం 20 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంటుంది. అంటే 44 వేల క్వింటాళ్ల ధాన్యం పండింది. కానీ నాలుగు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం కేవలం 700 క్వింటాళ్ల వరకే. పది వేల క్వింటాళ్ల ధాన్యం వరకు రైతులు తమ ఇంటి అవసరాలకు నిల్వ చేసుకున్నప్పటికి మిగితా 25 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. నింబంధనలు, నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెట్టే ఇబ్బందులతో రైతులు దళారులకు క్వింటాల్‌కు రూ.1,800లకే విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ గ్రేడ్‌రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు,రూ. 2,300లుగా నిర్ణయించారు. రైతులు దళారులకు క్వింటాల్ ధాన్యాన్ని రూ.1,800లకు విక్రయించి రూ.500 వరకు నష్టపోతున్నారు. ధర తక్కువ, తూకంలో మోసంతో రైతులు దళారుల చేతుల్లో బందీలుగా మారుతున్నారు.

40 క్వింటాళ్లు విక్రయించా



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పెట్టే కొర్రీలతో ఇబ్బందులు పడలేక, 40 క్వింటాళ్ల ధాన్యాన్ని దళారులకే విక్రయించా. క్వింటాల్‌కు రూ.1,900 చొప్పున విక్రయించాను. విక్రయించిన వెంటనే డబ్బులు చేతికొచ్చాయి. పంట సాగులో పెట్టుబడుల కోసం చేసిన అప్పులను తీర్చా. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు అందడం ఆలస్యమవుతుందని అమ్మేశా.

– నేనావత్ శంకర్‌నాయక్, మంతన్‌గౌరెల్లి

ఐదు కిలోల తరుగు



ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను మోసం చేస్తున్నారు. 70 క్వింటాళ్ల ధాన్యాన్ని యాచారం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే తేమ శాతం, నాణ్యత ప్రమాణాల నింబంధనలతో ఐదు రోజుల కొనుగోలు చేయలేదు. పడరాని పాట్లు పడ్డాను. ఏదో విధంగా విక్రయిస్తే క్వింటాలుకు ఐదు కిలోల ధాన్యాన్ని తరుగు తీశారు. నాణ్యత ప్రమాణాల తెలిపే యంత్రంలో కూడా మోసం ఉంది.

– మారెడ్‌పల్లి నరేందర్‌రెడ్డి, రైతు తక్కళ్లపల్లి

60 శాతం కోతలు పూర్తి



మండలంలోని 24 గ్రామాల్లో 60 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి ఇరకు 700 క్వింటాళ్ల ధాన్యం వచ్చింది. తక్కువ ధరైనా దళారులకే అమ్ముకుంటున్నారు. రైతులకు వరి ధాన్యాన్ని కల్లాల్లోనే ఎండబెట్టుకుని తీసుకురావాలని సూచిస్తున్నాం. నింబంధనల మేరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. విక్రయించిన రైతులకు త్వరలోనే డబ్బులు అందేలా కృషి చేస్తాం.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి

గిరిజనులను వెంటనే విడుదల చేయాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ డిమాండ్



పోలీసుల అదుపులో దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: లగచర్ల ఘటనలో అమాయక గిరిజనులను అక్రమంగా అరెస్ట్ చేశారని, ప్రభుత్వం వెంటనే వారిని విడుదల చేయాలని మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఫార్మా భూసేకరణలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించేందుకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ సోమవారం లగచర్ల గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. లగచర్లలో జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోలేమని, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలవకుండా, గిరిజనుల సమస్యలను వివరించకుండా అడ్డుకోవడం తగదన్నారు. గిరిజన జాతి సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం అక్రమంగా పోలీసుల చేత అరెస్టులు చేయించడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ పాండు, నాయకులు శ్రీను, మహేశ్, పాండు, అంజి, శ్రీకాంత్, రాజు, జగన్, రాజేశ్, భీమన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

మీర్‌పేట: బాలాపూర్ మండల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు కేఎల్‌ఆర్ ట్రస్ట్ ద్వారా 30 మంది విద్యావలంటీర్లను నియమిస్తానని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. దళిత సంక్షేమ సమితి అధ్యక్షుడు బైగళ్ల ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో అప్పికట్ల భరత్‌భూషన్ చారిటబుల్ ఫౌండేషన్, గ్రేస్ ఫౌండేషన్, బందు సొసైటీల సహకారంతో జిల్లెలగూడలోని చల్లాలింగారెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్లేట్లు, గ్లాసులు, ఇతర వస్తువులను అందజేశారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. స్వర్గీయ అబ్దుల్ కలాం స్ఫూర్తితో లీడ్ ఇండియా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, బైగళ్ల బాలమణి, నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, చల్లా బాల్‌రెడ్డి, ఎరుకల రవిగౌడ్, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు

జిల్లా సెరికల్చర్ ఏడీ ముత్యాలు

తలకొండపల్లి: పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు ఉంటాయని జిల్లా సెరికల్చర్ ఏడీ ముత్యాలు అన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి ఆర్థికంగా లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. సిద్దిపేట జిల్లా అంకపేట్ మండలం చౌటకుంట తండాకు చెందిన 30 మంది రైతులు సోమవారం మండల పరిధిలోని కోరింత తండాకు వచ్చారు. స్థానిక రైతులు చేపట్టిన పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటలను పరిశీలించారు. పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రునాయక్ ఆధ్వర్యంలో సిద్దిపేట రైతులు మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెరికల్చర్ ఏడీ ముత్యాలు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పట్టు పురుగుల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సబ్సిడీల రూపంలో అనేక రాయితీలు కల్పిస్తోందని తెలిపారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమ, తక్కువ సమయంలోనే అధిక దిగుబడిని పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రు నాయక్, రైతులు, రవీందర్, మల్లేష్, దశ్రు, వినోద్, భాస్కర్, సిద్దిపేట జిల్లా రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

మీర్‌పేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులను మెరుగుపరిచి పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని పీవైఎల్ (ప్రోగ్రెసివ్ యూత్ లీగ్) బాలాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కరమోల రాకేశ్, కొల్లూర్ భీమేశ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి–ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టేందుకు పీవైఎల్ రాష్ట్ర వ్యాప్త ఉద్యమం పోస్టర్లను సోమవారం బాలాపూర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు రకరకాల పరీక్షల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేయాలని, తద్వారా ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. కార్యక్రమంలో కోశాధికారి గందమల్ల మహేశ్, సలహాదారు సరేందర్, సభ్యులు కుమార్, జి.రామచందర్, పేట బాలు, శంకర్, దుంప వెంకటేశ్, చాగంటి ప్రవీణ్, ఎండీ.ఆయాజ్, నరేశ్, మహేందర్ పాల్గొన్నారు.



బాలాపూర్ చౌరస్తాలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాకేశ్, భీమేశ్

నేటి నుంచి కంటి వైద్య శిబిరం

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ఉచిత పరీక్షలు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి తొమ్మిది రోజుల పాటు మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజక వర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శంకర నేత్రాలయ సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు, కరుణాకర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, శ్రీను, చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి, మల్లయ్య, కొండల్‌యాదవ్, రఘు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

డీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రెహమాన్



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్: కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. ఉచిత విద్య, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలన్నారు. అర్హతలను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ సాగు, తాగునీరు, ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలని కోరారు. 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రవీందర్, జిల్లా కన్వీనర్ అమరేందర్, జిల్లా నాయకులు రాము, నాగార్జున , రంజిత్, మండల నాయకులు భాస్కర్, చక్రపాణి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్లార్ నమ్మించి మోసం చేశారు

గిరిజన కాంగ్రెస్ నేతల ఆరోపణ



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మండలానికి చెందిన వారికి ఇస్తామని మాట ఇచ్చి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కాంగ్రెస్ నాయకులను మోసం చేశారని మండల కాంగ్రెస్ గిరిజన నేతలు అంగోత్ కృష్ణానాయక్, మునావత్ పాండు నాయక్, నేనావత్ విఠల్‌నాయక్ ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీలకు రిజర్వ్ కావడంతో చైర్మన్ పదవి మహేశ్వరం మండలానికి చెందిన వారికే ఇస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ హామీ ఇచ్చి చివరి క్షణంలో కందుకూరు మండలానికి చెందిన సభావత్ కృష్ణానాయక్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత ఎనిమిది నెలల నుంచి మహేశ్వరం మండలానికి చెందిన వారికే పదవి ఇస్తామని వెంట తిప్పించుకొని, ఖర్చులు చేయించి ఇప్పుడు తమకు ఇవ్వకుండా కేఎల్లార్ మోసం చేస్తున్నారన్నారు. కేఎల్లార్ కొందరి చెప్పుడు మాటలు విని కష్టపడే కార్యకర్తలను దూరం చేసుకుంటున్నారన్నారు. కేఎల్లార్ నాయకత్వంలో మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనమవుతుందన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలను కేఎల్లార్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న కేఎల్లార్ తీరుతో నేతలందరూ అసంతృప్తితో పార్టీకి దూరమవుతున్నారన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు జరుగుతున్న అన్యాయాన్ని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కందుకూరు మండలానికి చెందిన వారికి ఇవ్వకుండా మహేశ్వరానికి చెందిన వారికి చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరారు. తాము కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగి పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామన్నారు. ఇప్పటికైనా కేఎల్లార్ వైఖరీలో మార్పు రావాలని భగవంతుడిని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాత్లావత్ బిచ్యానాయక్, మునావత్ భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటుతున్న అక్కాతమ్ముడు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక





కరాటే పోటిలో రజత పతకం సాధించిన తేజను అభినందిస్తున్న నిర్వాహకులు

యాచారం: కరాటేలో సత్తా చాటుతున్న అక్కాతమ్ముడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లికి చెందిన పర్షమోని శ్రీనివాస్‌ముదిరాజ్, మంజుల దంపతుల కూతురు లిఖిత, కుమారుడు తేజ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్నారు. అండర్– 19 విభాగంలో లిఖిత బంగారు పతకాన్ని సాధించగా, అండర్–14 పోటీల్లో తేజ రజత పతకం అందుకున్నాడు. వీరు డిసెంబర్ నెలలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

పది రోజుల్లో 74శాతం సర్వే

మున్సిపల్ కేంద్రంలో 65.5శాతం పూర్తి



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే సోమవారంతో పది రోజులు పూర్తయ్యాయి. ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసిన అనంతరం ఈ నెల 9 నుంచి సర్వే ప్రారంభించారు. మండల పరిధిలో 14 గ్రామ పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించారు. ఇప్పటికే 8,300 కుటుంబాల వివరాల సేకరణకు గాను 74శాతం సర్వే పూర్తయిందని అధికారులు వెల్లడించారు. రెవెన్యూ గణాంకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఈబీ సూపర్‌వైజర్లు, మున్సిపల్ కమిషనర్‌లు ఎప్పటికప్పుడు సర్వే తీరును పర్యవేక్షిస్తున్నారు.

మున్సిపల్ పరిధిలో 68.5శాతం పూర్తి

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 68.5 శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు. మున్సిపల్ పరిధిలో 7,868 ఇళ్లను గుర్తించిన ఎన్యుమరేటర్లు 5,387 కుటుంబాల కులగణన పూర్తి చేశారు. ఈనెల 23లోగా సర్వే పూర్తి చేసి అనంతరం కంప్యూటరీకరణ చేపడతామని మున్సిపల్ కమిషర్ రవీంద్రసాగర్ తెలిపారు.

కుల గణన సర్వేకు సహకరించండి



ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్యుమరేటర్‌కు వివరాలు ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో సర్వేలో భాగంగా ఆదిబట్ల మున్సిపల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వేతో ఎటువంటి నష్టం ఉండదని.. ప్రభుత్వం రాబోవు రోజుల్లో సంక్షేమ పథకాలు అందజేసేందుకు ఈ సర్వే ఉపకరిస్తుందన్నారు. ప్రజలంతా ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. నిర్భయంగా వివరాలను అందించాలని కోరారు. ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమాచారం తీసుకోవాలని అధికారులకు, ఎన్యుమరేటర్లకు సూచించారు.

పూర్తి వివరాలు సేకరించండి

ఆమనగల్లు: మండల పరిధిలో ఇంటింటి సర్వే చురుగ్గా కొనసాగుతోంది. సోమవారం ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్న తీరును కమిషనర్ వసంత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. కులగణనలో నిర్లక్ష్యం లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఆమె కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386